క్లుప్తంగా

త్వరితగతిన వినతుల పరిష్కారం



అర్జీలు స్వీకరిస్తున్న జెడ్సీ కృష్ణ

కంచరపాలెం: ప్రజా వినతుల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను జీవీఎంసీ జోన్–5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ ఆదేశించారు. జ్ఞానాపురంలోని జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 04 అర్జీలు అందాయి. పలువురి నుంచి వాటిని జెడ్సీ స్వీకరించి ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. టౌన్ ప్లానింగ్‌కు 02, యూసీడీ విభాగానికి 02 చొప్పున వినతులు అందినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్–1 టి.ఎస్.ఎన్.రాజు, సూపరింటెండెంట్–2 ఆర్.వి.రాజు, రెవెన్యూ ఆర్వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఇంజినీరింగ్ ఈఈ శ్రీనివాసరావు, టి.ప్రసన్నరెడ్డి, వాటర్ వర్క్స్ ఈఈ–2 సూరిశెట్టి శేఖర్, డీఈ శ్రీనివాసవర్మ, టౌన్ ప్లానింగ్ ఏసీపీ రఘునాథ్, పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.సునీల్‌కుమార్, సూపర్‌వైజర్ జనార్దన్, టీపీఆర్‌వో ఏపీడీలు చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

బీమా పరిహారం అందజేత



నామినీలకు బీమా చెక్కు అందజేస్తున్న ఏపీజీవీబీ అధికారులు

డాబాగార్డెన్స్: ప్రమాదవశాత్తు మరణించిన ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్(ఏపీజీవీబీ) ఖాతాదారులకు ఆ బ్యాంక్ ప్రతినిధులు సోమవారం ఇన్సూరెన్స్ పరిహారం అందజేశారు. కైలాసపురం, హెచ్‌బీ కాలనీ శాఖలకు చెందిన పాలసీదారులు(బీమా చెల్లించినవారు) టి.ఉమ, పి.రామకృష్ణకు సంబంధించి రూ.10 లక్షల క్లెయిమ్‌ను వారి మరణానంతరం నామినీలు టి.సాయి, పి.హరీష్‌కు ఏపీజీవీబీ చైర్మన్ కె.ప్రతాప్‌రెడ్డి చేతుల మీదుగా చెక్కు అందజేశారు. కార్యక్రమంలో ఏపీజీవీబీ ఆంధ్రా జీఎం శ్రీరామ సోమయాజి, ఆర్‌ఎం ఎస్.సతీష్‌చంద్ర, నోడల్ ఆఫీసర్ ఆకుల శివకుమార్, ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ క్లస్టర్ సేల్స్ మేనేజర్ జి.సురేష్‌బాబు, బీడీఎం జె.సోమేశ్వరరావు, పలువురు బ్రాంచ్ మేనేజర్లు పాల్గొన్నారు.

చిన్నమ్మలుకు పరామర్శ

అల్లిపురం: వైఎస్సార్‌సీపీ 33వ వార్డు మహిళా అధ్యక్షురాలు యల్లంకి చిన్నమ్మలు కుమారుడు శ్రీనివాస్ ఇటీవల అకాల మరణం చెందారు. విషయం తెలుసుకున్న పార్టీ దక్షిణ నియోజకవర్గ నాయకుడు సీతంరాజు సుధాకర్ సోమవారం సాయంత్రం అక్కయ్యపాలెంలోని వారి ఇంటికి పార్టీ వార్డు అధ్యక్షుడు రంధి గోపి కృష్ణ, 29వ వార్డు కార్పొరేటర్ ఉరుకూటి నారాయణలతో కలిసి వెళ్లారు. శ్రీనివాస్ భార్య, పిల్లలతోపాటు యల్లంకి చిన్నమ్మలును పరామర్శించారు. వారికి తమ వంతు సహకారం ఎల్లవేళలా ఉంటుందని భరోసా ఇచ్చారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వేస్టేషన్–మర్రిపాలెం మధ్య కోచింగ్ డిపో సమీపంలోని రైల్వే ట్రాక్ పక్కన గుర్తు తెలియని ఒక వ్యక్తి మరణించాడు. విశాఖ రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా.. కోచింగ్ డిపో సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మరణించాడు. ఇతడి వయసు సుమారు 35–40 సంవత్సరాలు. ఎత్తు సుమారు 5.6 అడుగులు. శరీరం కుళ్లిపోయి నల్లగా మారడంతో గుర్తించడానికి కూడా వీలులేకుండా ఉంది. ఇతను (అడిడాస్ పేరు గల) నలుపు రంగు ఫుల్ లోయర్, తెలుపు, నలుపు, పచ్చని రంగుల గీతలు గల టీ షర్ట్ ధరించి ఉన్నాడు. జీఆర్పీ సీఐ కోటేశ్వరరావు ఆదేశాలతో ఎస్‌ఐ బాలాజీరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు ఆచూకీ తెలిసిన వారు విశాఖ రైల్వే స్టేషన్‌లోని గవర్నమెంట్ రైల్వే పోలీసులకు స్వయంగా గానీ లేదా 96661 22722, 94406 27547 నంబర్లలో గానీ తెలియజేయాలని ఎస్‌ఐ బాలాజీరావు కోరారు.

లబ్ధిదారులకు రక్ష..
‘జగనన్న సురక్ష’



37వ వార్డులో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్(ఫైల్)

- ప్రజలకు విశేష సేవలందించిన కార్యక్రమం
- ‘దక్షిణ’లో 21,131 మందికి ధ్రువపత్రాల అందజేత

డాబాగార్డెన్స్: పేదలకు మేలు చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం దక్షిణ నియోజకవర్గంలో ఉద్యమంలా సాగింది. ప్రతి ఇంటికి వెళ్లి, ఏమైనా సమస్యలున్నాయా అని ప్రజలను అడుగుతున్న తొలి రాష్ట్ర ప్రభుత్వంగా వైఎస్ జగన్ సర్కార్ దేశంలోనే ముందుకు సాగుతూ.. ఓ చరిత్ర సృష్టించింది. నోరు తెరిచి అడగలేని, అర్హత ఉండి పొరపాటున ఎక్కడైనా మిగిలిపోయిన అర్హుల తలుపు తట్టి, లబ్ధి చేకూర్చే కార్యక్రమమే జగనన్న సురక్ష. నియోజకవర్గంలోని అన్ని సచివాలయాల పరిధిలో ఈ క్యాంప్‌లు విజయవంతంగా నిర్వహించారు.



33వ వార్డు సచివాలయంలో లబ్ధిదారుకు ధ్రువపత్రం అందిస్తున్న సిబ్బంది(ఫైల్)

ఉచిత సేవలపై లబ్ధిదారుల హర్షం

నియోజకవర్గంలోని 14 వార్డుల్లో నెల రోజుల పాటు 65 క్యాంపులు నిర్వహించారు. 66,327 కుటుంబాలను సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ప్రజాప్రతినిధులు సందర్శించారు. వారిలో అర్హత గల లబ్ధిదారులతో ప్రభుత్వ పథకాలు, ఇతర సేవలు పొందేందుకు అవసరమైన ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేయించారు. వీరిలో 21,131 మంది లబ్ధిదారులకు కుల, ఆదాయ తదితర సర్టిఫికెట్లను అందజేశారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా.. సులభంగా అందించిన సేవలపై లబ్ధిదారులంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, కార్యాలయాల చుట్టూ తిరిగే పనిలేకుండా కేవలం రెండు, మూడు రోజుల్లోనే అవసరమైన ధ్రువపత్రాలను అందజేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

సీఎం పాలన దేశానికే ఆదర్శం

ప్రతిపక్షాలు ఎన్ని విమర్శలు చేసినా.. పసిబిడ్డల నుంచి పండు ముసలి వరకు ఉపయోగపడే ఎన్నో సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చారు. అడక్క ముందే ప్రజల అవసరాలు తెలుసుకొని, వాటిని తీరుస్తున్న జగనన్నకు జనం జేజేలు పలుకుతున్నారు. జగనన్న సురక్ష ఒక మంచి కార్యక్రమం. ప్రభుత్వ సంక్షేమ పథకాలు చక్కగా అందుతున్నాయన్న ఆనందం ప్రజల కళ్లల్లో కనిపిస్తోంది. మేం గడప గడపకు వెళ్లినప్పుడు పథకాల గురించి వారంతట వారే చెబుతుండటంపై చాలా సంతోషంగా ఉంది. ఇవన్నీ దేశానికి ఆదర్శంగా నిలుస్తాయనడంలో సందేహం లేదు.

– వాసుపల్లి గణేష్‌కుమార్, ఎమ్మెల్యే

సులువుగా ధ్రువపత్రం పొందాను



జగనన్న సురక్ష ద్వారా నాకు అవసరమైన క్యాస్ట్ సర్టిఫికెట్‌ను సులువుగా పొందగలిగాను. వలంటీర్ ద్వారా దరఖాస్తు చేయగా.. వారం రోజుల్లోనే ధ్రువపత్రం అందజేశారు. ఇంతటి సౌకర్యం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు.

– చినిపిల్లి రాజవర్ధన్‌రెడ్డి, అమ్మవారి వీధి, 33వ వార్డు

ముఖ్యమంత్రి జగన్‌కు కృతజ్ఞతలు



మా పిల్లల చదువుల నిమిత్తం గతంలో క్యాస్ట్, ఇన్‌కం సర్టిఫికెట్ల కోసం ఎమ్మార్వో ఆఫీస్ చుట్టూ తిరగాల్సి వచ్చేది. జగనన్న సురక్ష కార్యక్రమంలో వాటిని కేవలం వారం రోజుల్లోనే మా వలంటీర్ ద్వారా సులువుగా అందుకున్నాం. సీఎం జగన్‌కు మా కృతజ్ఞతలు.

– ఈదుబిల్లి వెంకటలక్ష్మి, వెంకటేశ్వరమెట్ట, 33వ వార్డు

ఎమ్మెల్యే వాసుపల్లి దాతృత్వం

ఆపదలో ఉన్న వారికి ఆర్థిక సాయం



అశోక్‌పాత్రోను పరామర్శించి ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్



మహేశ్వరి, రామారావులకు ఆర్థిక సాయం అందిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

అల్లిపురం: ఆపదలో ఉన్న వారికి ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ నేనున్నాను.. అంటూ భరోసా కల్పిస్తున్నారు. ప్రతి శుక్రవారం ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు నిర్వహించే ప్రజాదర్బార్‌లో వచ్చిన వినతుల మేరకు ఆయన స్వయంగా బాధితులు, అవసరంలో ఉన్న వారి ఇళ్లకు వెళ్లి ఆర్థిక సాయం అందజేస్తున్నారు. ప్రభుత్వం నుంచి ప్రయోజనాలు వచ్చేలా చేస్తానని వారికి హామీ ఇస్తున్నారు. సోమవారం 32, 33 వార్డుల్లోని ఆరు కుటుంబాలకు ఆర్థిక సాయం అందించి దాతృత్వం చూపారు.

32వ వార్డులో నలుగురికి..

వార్డులోని నేరెళ్లకోనేరు, చెరువుగట్టుకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త కె.జగన్నాథరావు కొన్ని నెలలుగా క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. అతడిని ఎమ్మెల్యే వాసుపల్లి పరామర్శించి మెడిసన్ నిమిత్తం రూ.5 వేల అందజేశారు. చలువతోటలో నివసిస్తున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్త అశోక్‌పాత్రో చెగోడి వ్యాపారం చేసేవాడు. అతడు పెరాలిసిస్‌తో బాధపడుతుండగా మందుల నిమిత్తం రూ.5 వేల అందించారు. చలువతోటకు చెందిన పార్టీ కార్యకర్త దాసు భార్య కంచు వరలక్ష్మి మృతి చెందిన విషయం తెలుసుకుని పరామర్శించి రూ.5 వేల అందజేశారు. తారకరామ కాలనీకి చెందిన పార్టీ కార్యకర్త కండిపిల్లి నూకరాజు ఇటీవల మరణించడంతో అతడి భార్య కనకను పరామర్శించి రూ.5 వేల సాయన్ని వాసుపల్లి అందించారు.

33వ వార్డులో ఇద్దరికి..

వార్డులోని మట్టాబాబురావు వీధిలో నివసించే వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు మహేశ్వరి, రామారావుల తల్లి జలగడుగుల పోలమ్మ ఇటీవల మరణించారు. వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే వాసుపల్లి పరామర్శించి రూ.5 వేల అందజేశారు. సాయిబాబా వీధికి చెందిన పార్టీ కార్యకర్త గుళివిందల కొండమ్మకు పెరాలసిస్ వచ్చి కదలలేని స్థితిలో ఉండగా.. ఆమెను పరామర్శించి మందుల ఖర్చుల నిమిత్తం రూ.5 వేల ఆర్థిక సాయం అందించారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ 32వ వార్డు అధ్యక్షుడు మూలె రామిరెడ్డి, జేసీజే ఇన్‌చార్జ్‌లు దొడ్డి రామానంద్, కర్రి నీలకంఠం, సుపతి అప్పన్న, లండా రమణ, పాల శ్రీహరిరెడ్డి, బొడ్డేటి ప్రసాద్, బొర్రా శ్రీనివాసరెడ్డి, బోణి దేవ, బాబుల్ శ్రీను, ముజీబ్‌ఖాన్, బంగారమ్మ, అనురాధ, గంగ, కార్యకర్తలు ఉన్నారు.

ముర్రుపాలతో వ్యాధి నిరోధక శక్తి



తల్లిపాల విశిష్టతను తెలియజేస్తున్న డాక్టర్ నర్మద, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కుమారి

అల్లిపురం: బిడ్డకు ముర్రుపాలు పట్టించడంతో వ్యాధి నిరోధక శక్తి పెరగడంతోపాటు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని భీమ్‌నగర్ ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ నర్మద తెలిపారు. బిడ్డ రోగాల బారిన పడకుండా రక్షణ కవచంలా ముర్రుపాలు పనిచేస్తాయన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారి వీధి అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు తల్లి పాలుపడితే ఇద్దరూ ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కుమారి మాట్లాడుతూ తల్లిపాలు పసిపిల్లలకు అమృతం వంటివన్నారు. బిడ్డ పుట్టిన తరువాత అరగంటలోపు వచ్చే పాలను ముర్రుపాలు అంటారని వివరించారు. ఇవి శిశువుకు కచ్చితంగా పట్టడం ద్వారా రోగ నిరోధక శక్తి పెరిగి బిడ్డకు వ్యాధులు రాకుండా జీవితకాలం కాపాడుతాయన్నారు. ప్రతి రోజు మూడు నుంచి పది సార్లు తల్లిపాలు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం తులసి, మహిళా పోలీస్ నూర్జహాన్, శ్రావ్య, హారిక, దీప్తి, అంగన్‌వాడీ టీచర్లు భారతి, నాగేశ్వరి, సరిత, ఆయా కొండమ్మ, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

కాలుష్య నియంత్రణ సామాజిక బాధ్యత



ఆటోలో జీవీఎంసీ కార్యాలయానికి చేరుకున్న మేయర్ హరివెంకటకుమారి



బంగ్లా నుంచి సైకిల్‌పై కార్యాలయానికి వస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

డాబాగార్డెన్స్: కాలుష్య నియంత్రణ అందరి సామాజిక బాధ్యతని మేయర్ గొలగాని హరివెంకటకుమారి పేర్కొన్నారు. కాలుష్య నియంత్రణలో భాగంగా సోమవారం ఆమె తమ సొంత వాహనం వదలి క్యాంప్ ఆఫీస్ నుంచి ఆటోలో ప్రయాణించి జీవీఎంసీ కార్యాలయానికి చేరుకున్నారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తన బంగ్లా నుంచి సైకిల్‌పై కార్యాలయానికి వచ్చారు. అనంతరం జీవీఎంసీలో నిర్వహించిన డయల్ యువర్ మేయర్, జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలో వాయు, శబ్ద కాలుష్యం పెరిగిపోయిందని, వాటి నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. నగరంలో ప్రైవేట్, ప్రభుత్వ సంస్థల యాజమాన్యాలు వారంలో ఒక్క రోజు ప్రజా రవాణాను వారి సిబ్బందితో ఉపయోగించేలా చూడాలన్నారు. సాధ్యమైనంత వరకు విద్యుత్ వాహనాలను ఉపయోగించాలని మేయర్, కమిషనర్ సూచించారు.

కనకమహాలక్ష్మికి నేడు అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగే ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబర్ 060810011006681 టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ చేస్తారు. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లలో సంప్రదించవచ్చు.

13 నుంచి ప్రతిభా పోటీలు

డాబాగార్డెన్స్: దేశ 76వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 13 నుంచి 15 వరకు ప్రతిభా పోటీలు నిర్వహించనున్నట్టు మిరాకిల్ డ్యాన్స్ అకాడమీ వ్యవస్థాపకుడు మహ్మద్ షకీల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ‘ఐయామ్ యాన్ ఇండియన్–ఐ లవ్ మై ఇండియా’ పేరిట ద్వారకానగర్ పౌర గ్రంథాలయం వేదికగా మూడు రోజుల పాటు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 7.30 గంటల వరకు పోటీలు ఉంటాయన్నారు. క్లాసికల్, ఫోక్, వెస్టర్న్ డ్యాన్స్, సింగింగ్, గెటప్స్, డ్రాయింగ్ పోటీలు, ఇన్‌స్ట్రుమెంటల్ మ్యూజిక్, ట్రెడిషనల్ అండ్ ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు నిర్వహించనున్నట్టు చెప్పారు. పోటీలో పాల్గొనే ప్రతి ఒక్కరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్‌తోపాటు మెమెంటో అందజేయనున్నట్టు తెలిపారు. వివరాలకు 99664 85335 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఆరోగ్య మిత్రల సేవలు అభినందనీయం



ఆరోగ్య మిత్ర చిప్పాడ దీప్తికి ప్రశంసాపత్రం, నగదు పురస్కారాన్ని అందిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట: వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం లబ్ధిదారులకు ఉత్తమ సేవలు అందించిన ఆరోగ్య మిత్రల సేవలు అభినందనీయమని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. సోమవారం కలెక్టర్ చాంబర్‌లో ఉత్తమ సేవలందించిన ఆరోగ్య మిత్రలకు సేవా ఆరోగ్య మిత్రగా గుర్తించి ప్రశంసాపత్రాలను ఆయన అందజేశారు. ప్రతి నెలా ఒక్కరిని ఎంపిక చేసి ప్రశంసాపత్రంతోపాటు నగదు పురస్కారం అందిస్తామని కలెక్టర్ తెలిపారు. జూన్ నెలకు గానూ గీతం ఆస్పత్రిలో పని చేస్తున్న ఆరోగ్య మిత్ర చిప్పాడ దీప్తికి ప్రశంసాపత్రంతోపాటు రూ.5 వేల నగదు పురస్కారాన్ని అందించారు. కార్యక్రమంలో ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయకర్త డాక్టర్ కె.వి.వి.ఎస్.ఎన్.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

సీతమ్మధార: మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికులను ప్రభుత్వం పర్మినెంట్ చేసే వరకు పోరాటం ఆగదని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్ హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్త ఆందోళనలో భాగంగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సీఐటీయూ) కలెక్టరేట్‌ల ముట్టడికి పిలుపునిచ్చింది. సోమవారం కార్మికులు సరస్వతి పార్కు నుంచి ప్రదర్శనగా కలెక్టరేట్‌కు వెళ్లే ప్రయత్నంలో పోలీసులు అనుమతి ఇవ్వకుండా జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేసుకోవాలని ఆదేశించారు. అక్కడ సభ జరుగుతుండగా పోలీసులు చుట్టుముట్టి కొందరు కార్మికులను అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే వారిపై నిర్బంధమేంటని ఆందోళన వ్యక్తం చేశారు. జూలై 17న జీవీఎంసీ అధికారులు ఇచ్చిన మినిట్స్‌ను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఈ నెల 17న తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామన్నారు. నాయకులు పి.వెంకటరెడ్డి, వి.రాజు, టి.నూకరాజు, ఎం.వి.ప్రసాదరావు, రమణ, కె.కుమారి, వరలక్ష్మి, జె.ఆర్.నాయుడు, 200 మంది కార్మికులు పాల్గొన్నారు.

డిమాండ్ల సాధనకు ధర్నా



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న వీఆర్‌ఏలు

సీతమ్మధార: పే స్కేల్ అమలు చేయాలని, నామినీగా ఉన్న వీఆర్‌ఏలను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద జిల్లా గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం సభ్యులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అర్హులైన వీఆర్‌ఏలకు గ్రేడ్ 1 వీఆర్వో ప్రమోషన్ ఎగ్జామ్ లేకుండా ఇవ్వాలని, అటెండర్, వాచ్‌మెన్, డ్రైవర్ పోస్టులను వీఆర్‌ఏలకు కల్పించాలన్నారు. చనిపోయిన వీఆర్‌ఏ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, వీఆర్‌ఏలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, వేతనాలను రూ.26 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా సంఘ గౌరవ అధ్యక్షుడు వెంకటరావు, కన్వీనర్ ఎ.సత్యం, శంకరమ్మ, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

లైంగిక దాడి కేసులో రెండేళ్ల జైలు

విశాఖ లీగల్: యువతిపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తికి రెండేళ్ల జైలు శిక్ష, రూ.పది వేల జరిమానా విధిస్తూ నగరంలోని పోక్సో నేరాల ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి జి.ఆనంది సోమవారం తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించని యెడల అదనంగా 15 రోజుల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని ఆ తీర్పులో పేర్కొన్నారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ కరణం కృష్ణ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. నిందితుడు బొమ్మిడి మహాలక్ష్మి అలియాస్ రాజు (24) కాకినాడ నివాసి. గతంలో ఒంగోలులోని ఒక ప్రైవేట్ సంస్థలో పనిచేసేవాడు. తరువాత పాడేరు వచ్చి నివాసం ఏర్పర్చుకున్నాడు. డ్రైవర్‌గా పనిచేసేవాడు. బాధితురాలు(17) అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలం చుక్కల వీధి గ్రామ పరిధిలోని శివాలయం వీధిలో ఉండేది. హుకుంపేట మండలం గుత్తులపాడు హైస్కూలులో పదో తరగతి చదివేది. తరచూ అదే ప్రాంతంలో ఉండే మహాలక్ష్మితో పరిచయం ఏర్పడింది. ఈ పరిచయం ప్రేమగా మారింది. దీంతో ఇద్దరూ 2021 జూన్ రెండో తేదీన పాడేరు బస్టాండ్ నుంచి చిలకలూరిపేటకు వెళ్లారు. అక్కడ ఇద్దరూ ఉన్నారు. నిందితుడు మాయ మాటలు చెప్పి ఆమెను లోబర్చుకున్నాడు. అనంతరం వేరే ప్రాంతంలో వదిలి వెళ్లిపోయాడు. దిక్కులేని స్థితిలో పాడేరు చేరుకున్న బాధితురాలు హుకుంపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. పాడేరు ఎస్‌ఐలు జి.లక్ష్మణరావు, ఎం.శ్రీనివాసులు కేసు నమోదు చేశారు. అప్పటి ఏఎస్పీ తుషార్ కేసు దర్యాప్తు చేసి నేరాభియోగ పత్రాన్ని దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పునిచ్చారు.

డిగ్రీలో ప్రవేశానికి నేడూ దరఖాస్తుల స్వీకరణ



దరఖాస్తులు స్వీకరిస్తున్న కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల సిబ్బంది

మద్దిలపాలెం: డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి మంగళవారం కూడా దరఖాస్తులు స్వీకరిస్తామని ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు తెలిపారు. సోమవారంతో గడువు ముగిసిపోయినప్పటికీ ఒక రోజు పొడిగించామని చెప్పారు. విద్యార్థులు సీటు అలాట్‌మెంట్ ఆర్డర్‌తోపాటు అన్ని సర్టిఫికెట్లతో మంగళవారం హాజరు కావాలని ఆయన కోరారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం



వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందజేస్తున్న గొండు సీతారాం

సీతంపేట: తల్లిపాలే బిడ్డకు ఎంతో శ్రేయస్కరమని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం అన్నారు. అక్కయ్యపాలెం షాదీఖానా సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ తల్లులు పౌష్టికాహారం స్వీకరించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.లక్షల కోట్ల బడ్జెట్‌ను కేటాయిస్తున్నాయని గుర్తుచేశారు. అయినప్పటికీ అక్కడక్కడ మాతా, శిశు మరణాలు సంభవిస్తుండటం విచారకరమన్నారు. వీటి నివారణకు ప్రభుత్వంలోని అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రాష్ట్రంలో అంగన్‌వాడీ కేంద్రాలపై ఫిర్యాదులొస్తే తమ కమిషన్ ప్రత్యేక దృష్టి పెట్టి తక్షణ చర్యలకు ఆయా జిల్లాల ఉన్నతాధికారులకు సిఫార్సులు చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆఫీసర్లు రమణికుమారి, శ్రీలత, జిల్లా బాలల సంరక్షణ అధికారి రమేష్, మండల విద్యా శాఖాధికారి బాలామణి, సీఆర్పీ భాగ్యలక్ష్మి, చైల్డ్‌లైన్ ప్రతినిధి శారద, మహిళా పోలీసులు, ఆరోగ్య కార్యదర్శులు పాల్గొన్నారు.

రైతులకు సహకరిద్దాం

మురళీనగర్: రైతులు తాము పండించిన పంటలకు తగిన గిట్టుబాటు పొందడానికి వారి పంటను తమకు నచ్చిన ధరకు అమ్ముకోవడానికి ఫార్మర్స్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ సహకరిస్తుందని మిషన్ కర్షక దేవోభవ చైర్మన్ ఆడారి కిషోర్‌కుమార్ తెలిపారు. కర్షక దేవోభవ ప్రచార కార్యక్రమంలో భాగంగా సోమవారం కంచర పాలెంలోని ఐజీఐఏటీలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కేంద్రాలపై తగిన ప్రచారం లేదన్నారు. మనం రోజు తినే ఆహారాన్ని పండించే రైతులు అమ్మే కూరగాయలు, ఇతర పంటలు కొనే సమయంలో ఎటువంటి భేరాలు చేయవద్దని చెప్పారు. నిత్యం శ్రమటోడ్చి తాము పండించిన ఆహార పదార్థాలను దేశానికి అందిస్తున్న రైతులకు ప్రతి ఒక్కరూ కృతజ్ఞతతో ఉండాలన్నారు.

‘ప్రజలను ప్రభుత్వం ముంచేసింది’

మహారాణిపేట: రాష్ట్ర ప్రజలను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిట్టనిలువునా ముంచేసిందని తెలుగుదేశం పార్టీ ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌చార్జి బుద్ద వెంకన్న అన్నారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన ప్రసంగించారు. ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఆందోళనలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, గంటా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీలు వేపాడ చిరంజీవి, దువ్వారపు రామారావు, మాజీ మంత్రి బండారు సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యేలు గండి బాబ్జీ, కోళ్ల లలితకుమారి, పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి పాసర్ల ప్రసాదరావు పాల్గొన్నారు.

కారును ఢీకొట్టిన కంటైనర్



సత్యం జంక్షన్‌లో కారును ఢీకొట్టిన కంటైనర్

సీతమ్మధార: జాతీయ రహదారిపై సత్యం జంక్షన్‌లో ఓ కారును కంటైనర్ లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు డోర్ దెబ్బతింది. వివరాలిలా.. సోమవారం ఉదయం 11.30 గంటల సమయంలో గురుద్వారా నుంచి మద్దిలపాలెం వైపు భారీ కంటైనర్(ఒడిశాకు చెందిన) వెళ్తున్న క్రమంలో సత్యం జంక్షన్ వద్ద సిగ్నల్ పడింది. టీఎస్07ఎఫ్ ఎస్ 9857 నంబర్ గల కార్ సీతమ్మధార నుంచి గురుద్వారా వైపు వెళ్లే సమయంలో కంటైనర్ దానిని ఢీకొంది. జంక్షన్‌లో ఉన్న వారంతా కారు డ్రైవ్ చేసిన వ్యక్తిని కాపాడేందుకు వచ్చారు. ఎటువంటి ప్రమాదం జరగలేదు. అంతా ఊపిరి పీల్చుకున్నారు. ట్రాఫిక్ పోలీసులు వచ్చి కార్‌కు ఒక పక్కన పెట్టారు. సుమారు అర్ధగంట పాటు ట్రాఫిక్ జామైంది.